# హిట్లర్ రావు


డా॥ వి. చంద్రశేఖర రావు

పరమేశ్వరరావు జీవితం రెండు అంకాల నాటకం. స్కూలు లోపల. స్కూలు బయట. స్కూల్లో ఆయనను 'హిట్లర్ రావు' అని రిఫర్ చేస్తుంటారు. ఆయనో కోపిష్టి లెక్కల టీచరు. ఆయన పాఠం చెప్పే ఆ నలభై అయిదు నిముషాల కాలాన్ని 'హింసాత్మక ఘట్టం'గా భావిస్తారు పిల్లలు.

స్కూలు బయట ఆయన 'హార్ట్ పేషెంటు రావు'. సాయంకాలం అయిదు గంటలు కావడంతోటే హిట్లరు మార్కు విసుగు, అసహనం, వ్యంగ్యం ప్రతిఫలించే ఫేస్ మాస్కును స్కూల్లోనే వదిలేసి ఆర్తుడైన పేషంటు అవతారంలోకి దిగుతాడు. దిగులు, ఆందోళన, డాక్టర్లపై నమ్మకం, ఆరాధన ఎక్స్‌ట్రా రంగులు ముఖంపై పులుముకొని హాస్పటల్ వరండాలో 'పరమేశ్వరరావు, మేల్, 53' అనే డాక్టరు పిలుపు కోసం ఎదురు చూస్తుంటాడు. డాక్టరుతో ఆ ఒక్క నిముషం కన్సల్‌టేషన్ అయిపోయి 'మీ గుండె పదిలమే' అన్న డాక్టరు భరోసాతో తృప్తిగా నిట్టూర్చి ఇంటికి కదులుతాడు. ఇల్లు దగ్గరకు వస్తూందనగా మళ్ళీ హిట్లర్ రంగప్రవేశం చేస్తాడు. కూరల్లో ఉప్పు తగ్గించనందుకు భార్యపై విరుచుకుపడతాడు. కాలేజీ నుంచి ఆలస్యంగా వచ్చినందుకు కూతురు పార్వతిపై ఏకంగా శివతాండవమే చేస్తాడు. "ఈ హిట్లర్ పాత్రనిక ముగిద్దురూ! అది మీ గుండెకు చేటు" అని మిత్రులు ఎందరు చెప్పినా వినిపించుకోడు.

రావుగారి వ్యక్తిత్వంలోని ఈ రెండు పాత్రలు అప్పుడప్పుడూ అతి ఘోరంగా పోట్లాడుకుంటాయి. ముఖ్యంగా రావుగారి ట్రీట్‌మెంటు విషయంలో. హిట్లర్ రావు అభిప్రాయాలన్నీ నిశ్చల నిశ్చితాలు. బ్రహ్మదేవుడొచ్చినా ఆ అభిప్రాయాలు మారవు.

"డాక్టర్ శర్మ అని, మనవాడే, సుబ్రమణ్యశర్మగారి అబ్బాయి. ఉస్మానియాలో ఎమ్.డి. చేశాడట!" ఎంతలేదన్నా 'మనం' అనే ఫీలింగ్. "ఇవాళ రేపు బయటవాళ్ళను నమ్మడానికి వీల్లేదు. ఉన్నవి లేనివి చెప్పి ఫీజు లాగేస్తుంటాడు. అంచేత ఏ గూటి పక్షి ఆ గూటికి వెళ్ళటమే బెటరు.' మీ ఆరోగ్యానికి నాదీ హామీ' అని కూడా అన్నాడు డా. శర్మ. నాకు మరింక దిగుల్లేదు హెల్త్ గురించి." హిట్లర్ రావుగారి ఈ అభిప్రాయాలు కొందరు మిత్రులకు బాధ కలిగించినా ఈ మనిషి తీరే యింతని సరిపెట్టుకొంటారు. కానీ హార్ట్ పేషెంటు రావుకు మాత్రం బితుకు బితుకుమంటూనే వుంది. డా. శర్మ క్లినిక్‌లో గుంపులు గుంపులుగా పేషెంట్లు. అంతా తొడ తొక్కిడి. పట్టుమని ఒక నిముషం కూడా చూడడు. ఏదో రొటీన్‌గా మందులు రాసి స్తాడు. ఇంకో డాక్టర్ని కలవాలని కోరిక. కానీ ఊళ్ళో 'మనవాళ్ళు' వేళ్ళలో లెక్కబెట్టగలిగినంత మందే. వాళ్ళలోనూ గుండె జబ్బుల స్పెషలిస్టు



శర్మ ఒక్కడే.

రెండు నెలల తరువాత గుండెలో మళ్ళీ సన్నగా నొప్పి కనపడి రారెత్తిపోయాడు 'హార్ట్ పేషెంటు రావు'. భగవంతుడా పిల్ల పెళ్ళయే వరకైనా బ్రతకనివ్వవయ్యా అంటూ వేడుకొన్నాడు.

రావుగారి మొర ఆలకించినట్లున్నాడు దేవుడు. ఊళ్ళో కొత్తగా డి.ఎమ్. కార్డియాలజిస్ట్ డా. శశిధర్ క్లినిక్ ఓపెన్ చేసేడు. శశిధర్ 'మనవాడే'.

"ఫీజు కొంచెం ఎక్కువనుకో అయితేమాత్రం డయాగ్నోసిస్. ట్రీట్‌మెంట్ మేలిమి బంగారం. డాక్టరంటే వాడయ్యా. రోగం పాలిట చాలా నిర్దయగా వుంటాడు" అంటూ మురిసిపోయాడు హిట్లర్ రావు.

పేషెంటు సైకాలజీ చాలా చిత్రమైనది. డాక్టరు ఒక్క చిరునవ్వుకే పరవశించిపోతాడు. అవును, పేషెంటు ఆశ, ఆరాధన, నమ్మకము డాక్టరే కదా!

పేషెంటు గుండె దిటవు, జీవనోత్సాహం, ఆశ్రయం డాక్టరే కదా!

అయితే రావుగారి నమ్మకమూ, గుండె దిటవు రెండు నెలలకన్నా ఎక్కువ జీవించలేదు. చూస్తుండగానే డా. శశిధర్ ఊళ్ళో లీడింగ్ కార్డియాలజిస్టు అయ్యాడు. 'మనవాళ్ళు' మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఊళ్ళల్లోని లక్షాధికారులు, బిజినెస్ మాగ్నెటులు, పొలిటీషన్లు, అందరికీ ఆయనే ఆసరా అయ్యాడు.

రూపాయల వాన. కొత్త మారుతీ కారు, పది గావులు కాసే పేషెంట్లు.డా. శశిధర్ సామాన్యుడైన స్కూలుటీచర్ రావుగారి పిలుపుకు అందనంత ఎత్తుకు ఎదిగాడు. కొత్తగా ఎమ్.బి.బి.ఎస్. పాసైన కుర్రాడు ఆయన అసిస్టెంటుగా చేరాడు. రావుగారిలాంటి చిన్నా చితకా కేసులు ఆ కుర్రాడే చూస్తున్నాడు.

రావుగారి కళ్ళలో నీరు, గుండెలో ఆక్రోశం. ఏం! తనవి మాత్రం డబ్బులు కావా? మనవాడంటూ వెతుక్కొని వెళితే ఎంత పోజు!

లాభం లేదు మరో డాక్టర్ని వెతకాలి.

"రావుగారు! మీరు మరోలా అనుకోకపోతే డా. రెహమాన్ గుండె జబ్బులకు బెస్ట్ అని మంచి పేరు తెచ్చుకున్నాడు. పేషెంట్లంటే ప్రాణం పెడతాడు. మీరోసారి వెళ్ళిరాకూడదు" హిస్టరీ టీచరు సాంబశివరావుగారు సలహా యిచ్చారు.

మళ్ళీ రావుగారి రెండు అవతారాల మధ్య సంఘర్షణ.

"ఏమిటీ రెహమాన్. ముస్లిం డాక్టరు. ఇంత మంది మనవాళ్ళు ..."

హిట్లర్ రావు ఉలిక్కిపడ్డాడు.

"ఓరి నీ కులం తగలెయ్యా! బాధకు కులమేమిటి?

జబ్బుపడ్డ గుండెకు కులమేమిటి? రేపు నువ్వు చస్తే ఆ శవం కులమేమిటి?" హార్టు పేషెంటు రావుగారి ఆక్రోశం.

"కానీ రెహమాన్ దగ్గరకా, ఫ్లాష్‌బాక్ మాటేమిటి?" హిట్లర్ రావు సందేహం.

* * *

సుమారుగా నాలుగేళ్ళ క్రితం రావుగారు చండమార్తాండుడిలా తన చుట్టూ వున్న పరిసరాల్ని క్షణంలో మండు వేసవిగా మార్చగల ప్రతాపంతో వెలిగిపోతున్న రోజుల్లో జరిగిన సంఘటన.

సాయంకాలం ఆరుగంటలకు హైస్కూలు నుండి వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళుతున్నాడు ఇంటికి హిట్లర్ రావు. చేతిలో మిఠాయిలు, చిన్న పూల పొట్లం ఎక్స్‌ట్రా పట్టుకొని రొమాంటిక్ మూడ్‌తో రోడ్డుపై షికారుకి వెళుతున్న వృద్ధ సింహంలా వున్నారు. ఆ రోజు ఆయన చిన్న కూతురు పార్వతి పుట్టినరోజు. భిలాయ్‌లో వున్న పెద్ద కొడుకు శ్రీకంఠమూర్తి, వైజాగ్‌లో రెండో కొడుకు శ్రీనివాసులూ వాళ్ళ కుటుంబాల్తో సహా వచ్చారు. అందరూ కలసి గుడికి వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నారు. వేగంగా నడిచిపోతున్న రావుగార్ని


దీపావళి శుభాకాంక్షలతో

ఫోన్స్: ఆఫీసు-73456, రెసిడెన్స్-63739, 66482

షా అమీచంద్ తారాచంద్ అండ్ కం.,

పోస్టు బాక్స్ నెం. 120, నందిపాటివారి వీధి,

విజయవాడ - 520 001

"AMIR" బ్రాండ్ ఎన్వలప్స్, ఫైల్స్, విజిటింగ్ కార్డులనే ఎల్లప్పుడు ఉపయోగించండి.

బళ్ళార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బళ్ళార్‌పూర్, యమునానగర్



Sister Concern:


అమీచంద్ పేపర్ కంపెనీ,

లలిత్ ఎంటర్‌ప్రైజెస్

హఠాత్తుగా ఓ సైకిలు ఢీకొంది. సైకిల్ పైన వున్న కుర్రవాడు ఆయన స్టూడెంట్. పదిహేనేళ్ళు కూడా వుండవు. సినిమాల్లో విలన్‌లాగా కనబడాలని గెటప్ కాస్త మార్చుకున్నాడు. బాల నటుడికి విలన్ వేషంవేసి స్టేజి పైకి లాక్కొచ్చినట్లుగా వున్నాడు ఆ కుర్రవాడు. చొక్కా పైకి మడిచి, కాలరు నిటారుగా నిలిపి, రొమ్ము ముందుకు విరుచుకొని కళ్ళలో పొగరుబోతుతనాన్ని కురిపిస్తూ "మాస్టారూ! మీకు చత్వారం వచ్చినట్లుంది. పట్టపగలే సైకిల్ ఢీ కొట్టి యాక్సిడెంటు చేస్తున్నారు. అందరం కలిసి చందా లేసుకుని మీకు కళ్ళజోడు కొనిపెట్టమంటారా? " అన్నాడా కుర్రవాడు. వాడిపేరు రాము. టెన్త్ బి సెక్షన్. పొద్దున ఆడపిల్ల వైపు రాకెట్ విసిరాడని వారం రోజులు సస్పెండ్ చేయించారు రావుగారు. "రాస్కెల్! ఎంత పొగర్రా నీకు. కావాలని సైకిల్ ఢీకొట్టి నాకు చత్వారం అంటావా? నీ అంతు చూడకపోతే నా పేరు పరమేశ్వరరావు కాదు. రేపు స్కూలుకు రా! నీ పని చెబుతాను" అంటూ హుంకరించారు రావుగారు. "ఏంది బే నువ్వు చేసేది! నిన్నిప్పుడు పబ్లిక్ రోడ్డుపై చెప్పు తీసుకు కొడతాను. ఎవడు అడ్డు వస్తాడో చూస్తాను" అంటూ క్షణాల వ్యవధిలో సైకిల్ పైనుండి దూకి చెప్పుతో రావుగారి చెంపపై బలంగా కొట్టాడు. ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా దూరంగా బడ్డీ కొట్టు దగ్గర వున్న అయిదుగురు అవారా కుర్రవాళ్ళు అటు పరుగెత్తుకు వచ్చి, హాకీ స్టిక్ లతో రావుగారి ఒంటిపై పడాపడామని దెబ్బలు వేశారు. అంతా అర నిముషంలో జరిగిపోయింది. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఒకడు ఆయన లాల్చీని పర్రుమని చింపాడు. ఇంకోడు ఆయన కండువా లాగి కాలువలో విసిరేశాడు. ఆయన చేతి లోని తీపి సరుకు, పూల పొట్లం జారి మట్టిలో పడ్డాయి. మధుర స్వప్నమొకటి కళ్ళముందే కాలి బూడిదయినట్లుగా వుందా సన్నివేశం. వీధివీధంతా ఆశ్చర్యంతో, పశ్చాత్తాపంతో చూస్తూందా సంఘటన.

అప్పుడు, ఆ అవమానం నుంచి, కళ్ళ నుండి జారే వెచ్చని కన్నీటి సుదులలోంచి భరింపరాని వేదనాగ్ని ఏదో గుండె లోపల తటాలున ఎగిసింది. ఛాతీ వెనుక చిన్న కొలిమి ఏదో గప్పున రగిలిన ట్లుగా బాధ. 'అమ్మా' అంటూ గుండెల్ని చేతిలో పట్టుకొని క్రిందకు కూలబోయేంతలో – ఒక కుర్రవాడు– ఎర్రగా, మృదువుగా, అమాయకంగా వున్నవాడు, చూడగానే గంధర్వుడేమో అని రావు గారికి అనిపించినవాడు, రావుగార్ని రెండు చేతుల్తో పొదువుకొని దగ్గరలో వున్న టీస్టాల్ వైపు తీసుకె ళ్ళాడు. స్టూల్‌పై కూర్చోబెట్టి, మంచినీళ్ళు తాపి, టీ స్టాల్ కుర్రవాడికి మందుల చీటీ రాసి యిచ్చి మందుల షాపుకెళ్ళి ఆ మాత్రలు తీసుకురమ్మని పంపాడు. మాత్ర వేసిన అయిదు నిముషాలకే

## మరణం



రుతువులను గుర్తించనపుడు
ప్రతిధ్వనించనపుడు
ఓ వృక్షం
మరణిస్తుంది!
పారే దారి దొరకనపుడు
దాహం తీర్చనపుడు
నీరు
మరణిస్తుంది!
ఒక్క పంటనూ పండించనపుడు
కొత్త పాటకు వెలుగు చూపనపుడు
భూమి
మరణిస్తుంది!
ఆశ్చర్యం సడలినపుడు
జీవనోత్సాహం ఉడిగినపుడు
మనిషి
మరణిస్తాడు!

మూలం :
మాక్సిమ్ టాంక్, బైలో రష్యా
అనువాదం :
రంగనాథ రామచంద్రరావు

రావుగారికి రిలీఫ్ రావడం మొదలు పెట్టింది. కృత జ్ఞతతో ఆ కుర్రవాడి వైపు తిరిగి "మీదేవూరు?" అనబోయి "మీదే లోకం?" అన్నాడు. కుర్రవాడు సన్నగా నవ్వుతూ "మాదీ మీ వూరే మాస్టారూ! నేను మీ వాడినే. హైస్కూలు రోజుల్లో, మీ బెత్తం దెబ్బల క్రమశిక్షణలో రాటుతేలిన వాడినే. ప్రస్తుతం మెడిసిన్ చేస్తున్నాను" అన్నాడు మృదు వైన కంఠంతో. రావుగారికింకా నమ్మకం కలగడం లేదు. ఆ కుర్రవాడు అలా హఠాత్తుగా ప్రత్యక్షం కావడం, నిముషాల్లో మంత్రం వేసినట్లుగా నొప్పిని తగ్గించడం అంతా కలలా వుంది. "నీ పేరు బాలగంధర్వా?" అన్నాడు ఇంకా అదే ట్రాన్స్‌లో వుండి. "పోనీ అలాగే పిల్చుకోండి" అంటూ లేచి నిలబడ్డాడు సెలవు తీసుకోను. చుట్టూ మూగిన పౌరుల సానుభూతి వరదలో దూరంగా కొట్టు కుపోయి ఆ పైన ఫేడౌట్ అయ్యాడా కుర్రవాడు. సైగల్ పాటలంత కమ్మగా, మృదువుగా వున్న ఆ కుర్రవాడి మాటలు, చిరునవ్వు రావుగార్ని చాలా రోజులు వెంటాడాయి.

ఆరు నెలల తరువాత ఆ కుర్రవాణ్ణి మరోసారి చూశాడు రావుగారు. ఉదయాన్నే గీతాయజ్ఞానికి వెళుతూ ఐదు గంటల మసక వెలుతురులో శంక ర్‌విలాస్ సెంటర్లో చూశాడా కుర్రవాణ్ణి. సైకిల్, సైకిల్ వెనక న్యూస్ పేపర్ల కట్ట. ఆ కుర్రాడే. కృష్ణుడి వేషంలోంచి భటుడి వేషంలోకి మారిన రంగస్థల నటుడిలా వున్నాడు. "నువ్వేనా బాల గంధర్వా?" అన్నాడు ఆశ్చర్యంతో. "అవును మాస్టారూ! నేనే" అన్నాడు ఎప్పటిలా సన్నని చిరునవ్వుల మిలమిలలతో. "ఏమిటిది మారు వేషమా?" అన్నారు రావుగారు తీరని క్యూరియా సిటీతో. "మారువేషం కాదు. బ్రతుకు తెరువు కోసం. పోషించే తండ్రి కాలం చేశాడు. ముసలి తల్లి. ఇలా పార్ట్ టైం జాబ్ చేస్తూ ఇద్దరం కాలం వెళ్ళబుచ్చుతున్నాము" అన్నాడు వినయంగా. "ఈ పేపర్ బాయ్ పనేం ఖర్మ! హాయిగా వైద్యం చేసు కోకూడదూ? డబ్బుల వాన కురిసేది" రావుగారి సలహాకు నవ్వు వచ్చి "గవర్నమెంటు వప్పకోదు. ఎం.బి.బి.ఎస్. అయిపోవాలి. రిజిస్ట్రేషన్ చేయిం చాలి. అప్పటిమాట. సరి, మీ సంగతేమిటి? ఎలా వుంది ఆరోగ్యం" అన్నాడు. "భేషుగ్గా వుంది. అమృతపు గుళికలాంటి మాత్ర ఏదో ఇచ్చావు కదా! ప్రస్తుతానికి ఢోకా లేదు. రేపోసారి మా యింటికి వచ్చి కనపడు!" అంటూ ఆర్డరు వేసి వెళ్ళాడు. అలాగేనంటూ సైకిల్‌పై తుర్రుమన్నాడా కుర్రవాడు.

ఆ మరుసటి రోజు ఉదయం ఆరింటికి ఇంట్లో గొప్ప హడావుడి చేశాడు హిట్లర్ రావు. అందర్నీ వరసగా నిలబెట్టి "బాలగంధర్వా, వీళ్ళందరినీ చెకప్ చేసి మందులు రాసివ్వు" అన్నాడు. "గతంలో నాకు ఆయుర్వేదం అంటే ప్రాణం. అదుగో ఆ వేళ నువ్వు నా గొంతులో ఆ మాత్ర వేసినప్పటి నుంచి నేను ఇంగ్లీషు మందుల అభిమానినయ్యాను. ఇవాళ నుంచీ వీళ్ళందరూ నీ పేషంట్లే. చెకప్ చేసి అవసరమైన మందులివ్వు" అని ఆర్డర్ వేశాడు. "ఏమిటండీ ఇదంతా? నేను డాక్టర్ని కాను. ఇంకా డిగ్రీ పూర్తి కాలేదు" అన్న ఆ కుర్రవాడి మాటలకు ఉగ్రుడై "వెధవ డిగ్రీ, వాళ్ళిచ్చేదేమిటి? నేనిస్తు న్నాను. నీ ప్రతిభ నేను పరీక్షించాను. నీ ధాటికి

ఏ డాక్టరూ  చాలదు. కానివ్వు ట్రీట్‌మెంట్" అన్నాడు.

సిగ్గుపడుతూ, అందరికీ బి.పి., పల్స్ చూసి. ఏదైనా ఇబ్బంది వుందేమో కనుక్కొని మందులు రాసిచ్చాడు. చివరిగా పార్వతి చేయి ముందుకు సాచింది. పార్వతిని గుర్తుపట్టి "మీరు, మీరు కూడా నన్నిలా అల్లరి పెట్టటం బాగోలేదు" అంటూ చేతులు జోడించాడు. చిరునవ్వుతో లోపలికి  వెళ్ళింది పార్వతి. వంద రూపాయల నోటు చేతిలో పెట్టాడు రావుగారు. "ఫీజు తీసుకోవడం డాక్టరు హక్కు. వేషాలు వెయ్యకుండా తీసుకో" అంటూ బెదిరించి డబ్బులు జేబులో పెట్టి పంపించాడు రావుగారు.

హిట్లర్ రావుగారికి కుర్రవాడి మీద గురి కుదిరింది.  వారం వారం ఇంటికి వచ్చేవాడు బాలగంధర్వుడు. ఆ సంవత్సర కాలంలో మరో డాక్టరు దగ్గరకు వెళ్ళలేదు రావుగారు. "ఆ కుర్రవాడి హస్తవాసే వేరు. అశ్వనీ దేవతల అంశలో పుట్టాడు" అంటూ అతన్ని ఆకాశానికి  ఎత్తేసేవాడు.

బాలగంధర్వుడు ఫైనలియర్‌కు వచ్చిన తరువాత, హిట్లర్ రావు అతనికో వెయ్యి రూపాయిలిచ్చి "ఇక పార్ట్ టైం ఉద్యోగాలు మానెయ్యి. ఈ యేడు బాగా చదవాలి నువ్వు. సముద్రమంత పోర్షను. ఈ డబ్బు ఒక తండ్రి బిడ్డకిచ్చే గిఫ్ట్ అనుకో. మొహమాటమేస్తే అప్పు అనుకొని తరువాత  ఎప్పడైనా పెద్ద ప్రాక్టీషనర్ అయినాక తీరుద్దువుగాని.  తీసుకో. ఆల్ ది బెస్ట్" అంటూ  దీవించాడు రావుగారు. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయా కుర్రవాడికి. కాళ్ళపై పడి ఆయన పాదాలు కళ్ళ కద్దుకున్నాడు.

ఏడాది తరువాత ప్రత్యక్షమయ్యాడు బాలగంధర్వుడు. "ఇంటర్న్ అయిపోవచ్చింది.  క్లినిక్ ఓపెన్  చేస్తున్నాను. మీరే స్వయంగా వచ్చి ఓపెన్ చెయ్యాలి" అంటూ రావుగార్ని హృదయపూర్వకంగా ఆహ్వానించాడు. ఆనందంతో పులకరించిపోయాడు రావుగారు. కుటుంబ సమేతంగా వెళ్ళాడా క్లినిక్  ప్రారంభోత్సవానికి.

క్లినిక్ దగ్గర బోర్డు చూసి క్షణంపాటు నిశ్చలుడైపోయాడు రావుగారు. ప్రజావైద్యశాల. డా. రెహమాన్ ఎం.బి.బి.ఎస్. అని వుంది. భగవంతుడా, అని నుదిటిపై కొట్టుకొన్నాడు. తన  ప్రాణంలో ప్రాణంగా అభిమానించిన కుర్రవాడు, అశ్వనీ దేవతల అంశలో పుట్టాడనుకొన్నవాడు, ముస్లిం కుర్రవాడు అనే నిజం చురకత్తిలా గుండెను కోసివేస్తుంది. ఆయనకెందుకో  చెప్పలేనంత అసంతృప్తి, కోపం, దగా చెయ్యబడ్డాననే భావం కలిగాయి. రెహమాన్ ఎదురువచ్చి హృదయార్పితంగా అంజలి జోడించి "రండి మాష్టారూ!" అంటూ లోపలికి ఆహ్వానించాడు. "దొంగ భడవా! ఎంత దగా చేశావురా! నా యింట్లో నా బిడ్డలాగే సర్వహక్కుల్నీ అనుభవించి, నా  సరసన ఎన్నోసార్లు భోజనం చేసి, ఒక్కసారయినా ముస్లిం కుర్రవాణ్ణి అని చెప్పలేదు కదరా!" అంటూ పెద్దగా తిట్టాలనిపించినా సంస్కారం అడ్డువచ్చి మౌనంగా లోపలికెళ్ళాడు. ఎండిపోయిన పూలచెట్టు లాంటి ఒక ముసలి స్త్రీ వినయంగా ఆయన కాళ్ళకు నమస్కరించింది.  "అమ్మ" అంటూ పరిచయం చేశాడు రెహమాన్.  పది నిముషాలకంటే ఎక్కువసేపు అక్కడ  గడపలేకపోయాడు. ఆ కాసేపూ ముభావంగా వుండిపోయాడు రావుగారు. ఆ తరువాత మళ్ళీ రెహమాన్‌ను కలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు. కానీ తాను మోసపోయాననే భావం ఆయన గుండెల్ని సలుపుతూనే వుంది. ఏదైనా ప్రతీకారం చెయ్యాలనే కోరిక రావుగార్ని దహించివేస్తూంది.

ఒక సాయంకాలం స్కూలు నుండి సరాసరి రెహమాన్ క్లినిక్ దగ్గరకు వెళ్ళి, బయటే నిలబడి హెచ్చరిక లేని దాడిలా "ఏం జన్మరా నీది! కృతజ్ఞత లేని జన్మ. వెయ్యి రూపాయలు అప్పు తీసుకొన్నావు. ఆపదలో వున్నావని జాలి తలిచి యిచ్చానా డబ్బు. వందలు వేలు సంపాదిస్తున్నావు కదా క్లినిక్ పెట్టి. ఏం అప్పు తీర్చవచ్చుకదా! అప్పు తీర్చకపోతే యేం? వెర్రి బ్రాహ్మడు, సంతకం లేకుండా ఇచ్చాడు. ఏమిటి వీడికిచ్చేదని గమ్మున ఊరకున్నావు? వెయ్యి మిగిల్నా మిగిలినట్టే కదా! దౌర్భాగ్యుడా! ఎందుకురా నీ డాక్టరు డిగ్రీ, తగలేసుకోనా? చిత్తశుద్ధి,

నిజాయితీలేని నువ్వో డాక్టరువి!  నీకేమో పేషెంట్లు! నీలాంటివాడి బారిన పడిన వీళ్ళను దేవుడే కాపాడాలి"

అంటూ నిప్పులు కక్కారు హిట్లర్ రావు. రెహమాన్ ముఖంలో నెత్తుటి చుక్కలేదు. తండ్రిలా ఆరాధించిన రావుగారేనా  అని విస్తుపోయాడు. "సార్! మీరు పొరబడుతున్నారు..." రెహమాన్ సంజాయిషీని వినిపించుకోకుండా చరాచరా వెళ్ళిపోయాడు హిట్లర్ రావు, అమాయకపు మేకపిల్లను బలికొన్న పులిలా రహస్యానందాన్ని అనుభవిస్తూ.

* * *

"ఇంతటి ఫ్లాష్ బాక్ పెట్టుకొని ఏ ముఖంతో వెళ్ళాలి రెహమాన్ దగ్గరకు" హిట్లర్ రావు ప్రశ్న.

"ఒకసారి వెళితే తప్పేముంది?  ప్రాణం కంటే ప్రిస్టేజీ ఎక్కువా?" హార్ట్ పేషెంటు రావు డిమాండు.

సంఘర్షణ ముగిసి, డా. రెహమాన్ దగ్గరకు వెళ్ళడానికి నిర్ణయించుకొన్నారు రావుగారు.


రావుగార్ని చూడగానే కళ్ళలో ఆనందం చిప్పిలుతుండగా "మాష్టారూ! మీరేనా! ఎన్నాళ్ళయింది మిమ్మల్ని చూసి. బాగా చిక్కిపోయారు సుమా! అమ్మ ఎలా వుంది?  పార్వతి పెళ్ళి సెటిలయిందా?" కుశల ప్రశ్నలు వేస్తూ లోపలికి తీసుకెళ్ళాడు. రావుగారి కళ్ళలో నీళ్ళు. "నిన్నేనా తండ్రీ!  అంతగా క్రూరంగా అవమానించేను. పిసరంత కోపం కూడా లేదే. వయసులో చిన్నవాడివైనావు. లేకుం● పాదాభివందనం చేద్దును" మనసులోనే గొణుక్కున్నాడు రావుగారు.

ఆరోగ్యం గురించి విని కలతపడ్డాడు రెహమాన్. వెంటనే పరీక్షలన్నీ చేశాడు. పరీక్ష చేస్తున్నప్పుడు ఏదో చిత్రమైన అనుభూతిని పొందాడు రావుగారు. ఆ స్పర్శలో ఓదార్పు వుంది. ధైర్యం చెప్పడం వుంది. గతంలో ఎందరో డాక్టర్లు రావుగార్ని పరీక్ష చేశారు. వాళ్ళు పరీక్ష  చేస్తున్నప్పుడు యంత్రపు పనిముట్లు ఏదో శరీరంపై పాకుతున్నట్టుగా వుండేది. రెహమాన్  స్పర్శలో మంత్రమహిమ వుంది. ప్రియమైన స్నేహితుడి స్పర్శ వుంది.

రావుగారికి  రెహమాన్‌పై నమ్మకం చిక్కింది.

అవును పేషెంటు ఆశ, ఆరాధన, నమ్మకమూ డాక్టరే కదా!

పేషెంటు గుండె దిటవు, జీవనోత్సాహం, ఆశ్రయం డాక్టరే కదా! ●



## అక్షరక్రాంతి

విత్తనం – అక్షరం
ఒక్కటే ఈ రెండింటి లక్షణం
రూపాలు మాత్రం అణువంత
విలువలు మాత్రం మణులంత

ఆ రెండింటిలో కనిపించని
దివ్యశక్తులు "జవం – జీవం"
విత్తనాన్ని నాటితే రంగరంగ వైభోగం
అక్షరాన్ని మీటితే సుస్వరాల సరాగం

విత్తనం – పాతినంతనే
తనని తాను పేల్చుకుని
పుడమి కడుపు చీల్చుకుని
పెరుగుతుంది పెను వృక్షమై జీవన భుక్తిగా!

అక్షరం – నాటినంతనే
మనోజలధిని మథనం చేస్తూ,
కాగితంపై కావ్యకన్యలా నర్తిస్తూ
జీవితాన్ని క్రాంతివంతం చేస్తుంది దివ్యశక్తిలా-

—చిట్టూరి గోపీచంద్